అభివృద్ధిలో అగ్రభాగాన తెలంగాణ

- శాసనమండలి చీఫ్ విప్ భానుప్రసాదరావు
- జూలపల్లి మండల సరసభ్య సమావేశానికి హాజరు


జూలపల్లి మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు

జూలపల్లి: అభివృద్ధిలో తెలంగాణ అగ్రభాగాన ఉందని శాసన మండలి చీఫ్‌విప్ ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాదరావు అన్నారు. సోమవారం ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, దీనికి ముందు చూపు ఉన్న పటిష్ఠ నాయకత్వం, సీఎం చంద్రశేఖర్‌రావు పట్టుదల కారణమన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా మారి, సాగు, తాగు నీరు కొరత తీర్చిన ఘనత కేసీఆర్ కే దక్కిందన్నారు. సంక్షేమపథకాలతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

ఘన స్వాగతం...

శాసన మండలి చీఫ్ విప్‌గా బాధ్యతలు తీసుకుని మొదటి సారి మండలానికి వచ్చిన సందర్భంగా భాను ప్రసాదరావుకు ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఘన స్వాగతం పలికి, గజమాలతో సన్మానించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్ తన వ్యవసాయ క్షేత్రంలో భానుప్రసాదరావును సన్మానించారు. డీ83 కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ రేణుక, మండల వైస్ చైర్మన్ రమేశ్, అధి కారులు, సింగిల్‌విండో చైర్మన్లు, పాల్గొన్నారు.

చీఫ్ విప్‌కు వినతులు

తమ ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు భాను ప్రసాదరావుకు వినతి పత్రం అందజేశారు. మరో పది రోజులు కాలువ నీళ్లు ఇవ్వాలని రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భానుప్రసాద్‌రావు హామీ ఇచ్చారు.

సీఎల్పీ నేతకు సమస్యల ఏకరువు


భట్టికి వినతిపత్రం ఇస్తున్న రజక సంఘం నాయకులు

రామగుండం: హాథ్ సే హాథ్ జోడో పీపుల్స్‌మార్చ్‌లో భాగంగా శాసనసభా ప్రతిపక్ష నేత భట్టి విక్రమార్క సోమవారం ముర్మూర్ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ భట్టిని గజమాలతో ఘనంగా సన్మానించి, నాగలిని బహూకరించారు. పాదయాత్రకు మంచి స్పందన లభించింది. పలువురు తమ సమస్యలను భట్టికి ఏకరువు పెట్టారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజకులు వినతిపత్రం అందించారు. బ్రాహ్మణపల్లిలో మహిళలు తమకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని మొరపెట్టుకున్నారు. పాదయాత్రలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు పెంద్రు హన్మాన్‌రెడ్డి, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, ఉరిమెట్ల రాజలింగం, కార్పొరేటర్లు ముదాం శ్రీనివాస్, మహంకాళి స్వామి, పెదెల్లి ప్రకాష్, కొలిపాక సుజాత, గాదం విజయ, వేలాదిగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కేసీఆర్ కుటుంబానికే కొలువులు

పాలకుర్తి: పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర సోమవారం రాత్రి పాలకుర్తి మండలం పుట్నూర్, గుడిపల్లి, జయ్యారం గ్రామాల్లో కొనసాగింది. కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. గ్రామ కూడలిలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు అనేక వనరులు ఉన్నాయని, కేసీఆర్ మాత్రం ఉన్న పరిశ్రమలను మూసివేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కొలురైతులకు పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. మండలంలో జూనియర్ కాలేజీ నిర్మిస్తామన్నా. కార్పొరేటర్లు మహంకాళి స్వామి, కొలిపాక సుజాత, ముదాం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుండ నీటిని ఎక్కువగా తాగాలి


మాట్లాడుతున్న హెల్త్ ఆఫీసర్ పద్మ

గోదావరిఖని: కుండలో నీటిని ఎక్కువగా తీసుకుంటూ వేసవి కాలంలో ఎండదెబ్బకు గురికాకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సింగరేణి హెల్త్ ఆఫీసర్ పద్మ సూచించారు. సోమవారం వకీల్‌పల్లిగనిపై కార్మికులకు వేసవి జాగ్రత్తలు వివరించారు. ఎండలో సాధ్యమైనంత మేర ప్రయాణాలు చేయకూడదని, తప్పనిసరైతే హెల్మెట్, తలకు రుమాలు చుట్టుకోవాలన్నారు. వేసవికాలంలో దొరికే కీరదోస, పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తాగాలన్నారు. మసాలా దినుసుల వాడకం, ఆల్కాహాల్ సాధ్యమైనంత మేర తగ్గించాలని, కూరగాయల భోజనానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రవికుమార్, సంక్షేమాధికారి ఓంకారిబాబు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు కోసం స్థలం కేటాయించాలి


వినతిపత్రం ఇస్తున్న ఏఎంసీ చైర్మన్

కమాన్‌పూర్: మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ యార్డు కోసం స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి రాయలింగు సోమవారం తహసీల్దార్ దత్తు ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. మార్కెట్ కమిటీ ఏర్పాటు చేసిన నేటి వరకు సొంత భవనం, యార్డు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మార్కెట్ యార్డు కోసం స్థలాన్ని కేటాయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. చైర్మన్ వెంట వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మిమల్లు, కార్యదర్శి ఈర్ల సురేందర్ ఉన్నారు.

ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న గ్రామస్తులు


అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

ఫెర్టిలైజర్‌సిటీ: ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్ నుంచి రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్, ఎలకలపల్లి గేట్ వెళ్లే రహదారిని మూసేందుకు ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం ప్రహరీ నిర్మించేందుకు సోమవారం జేసీబీతో పనులను చేపట్టారు. దీంతో ఎల్కలపల్లి గేట్, లక్ష్మీపురం కొత్తగేట్ ప్రజలు గోడ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. గ్రామస్తులు ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు తాత్కాలికంగా గోడ నిర్మాణ పనులు నిలిపేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుర్ల శ్రీనివాస్, బొట్ల స్వామి, పోచం, గ్రామస్తులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో అరాచకపాలన'

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో అభివృద్ధి జరుగుతుందని ఆశిస్తే సీఎం కేసీఆర్ అరాచకపాలన సాగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు సి. సత్యనారాయణరెడ్డి, గంట రాములు ఆరోపించారు. పెద్దపల్లిలో సోమవారం మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి, నిరుద్యోగ యువతకు జరిగిన అన్యాయాలను ప్రజలకు వివరిస్తూనే ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర చేపట్టారన్నారు. మంగళవారం పెద్దపల్లికి చేరుతున్న పాదయాత్రకు పాలితంలో స్వాగతం పలికి, సాయంత్రం జెండా కూడలిలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలు విస్తృతంగా ప్రచారం చేయాలి

ఓదెల: సీఎం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని నాంసానిపల్లె, అబ్బిడిపల్లె గ్రామాల్లో సోమవారం ఆత్మీయ సమ్మేళనాలు జరిగాయి. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను రచ్చబండ చౌరస్తాల్లో గ్రామస్తులకు వివరించాలన్నారు. అబ్బిడిపల్లెలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి, పొత్కపల్లి సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మండల చైర్మన్ కావటి రాజు, ఆకుల మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దేవక్క

కమాన్‌పూర్: రామగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ ఆరెల్లి దేవక్క అధ్యక్షతన నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు మంజూరు కాగా, మెజార్టీ సభ్యులు తీర్మానం చేసి ఆన్‌లైన్ చేసిన ప్రొసీడింగ్ కాపీలు ఇవ్వకపోవడంపై ఎంపీటీసీలు, ఎంపీపీ మధ్య వాగ్వివాదం నెలకొనగా అధికారులు తీర్మానం కాపీలు అందజేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మాట్లాడగా మండల పరిధిలో నెలకొన్న సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని అధికారుల తీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సమస్య ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పన్నూర్‌లో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించడం లేదని, కల్వచర్లలో వైద్య సిబ్బందిని నియమించడం లేదని, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులు నిర్మించి నేటి వరకు పైపులైన్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ప్రజలకు తాగునీరు అందించలేకపోతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, కమాన్‌పూర్ ఏఎంసీ చైర్మన్ దాసరి రాయలింగు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ఇనుముల రమేశ్, వైస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

'పేదల ఆరోగ్యంపై ఎమ్మెల్యేకు పట్టింపేది?'


సూపరింటెండెంట్‌తో సమావేశమైన ప్రజాప్రతినిధులు

మంథని: నాలుగేళ్లుగా మంథని ప్రభుత్వాసుపత్రిని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పట్టించుకోవడం లేదని ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ సుమలత అన్నారు. సోమవారం మంథని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డితో సమావేశమై వైద్యుల వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రి చైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యేకు పేదోడి ఆరోగ్యంపై శ్రద్ధ లేదన్నారు. ఆస్పత్రిలో వైద్య సేవలు, వసతులు గురించి ఆలోచన చేయలేదని పేర్కొన్నారు. పుట్ట మధు హయాంలో ఆస్పత్రిలో అనేక వసతులు కల్పించడంతోపాటు ఆధునిక వైద్యం అందుబాటులో వచ్చేలా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి. నాయకులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్

కోల్‌సిటీ: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని అర్బన్ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు స్వప్నలత, చంద్రశేఖర్, మణికేశ్వర్‌రెడ్డి, తిరుమల, ఆస్మా, మాధురి, నీలిమా అన్నారు. సోమవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు సీపీఆర్ ఎలా చేయాలనే అంశాలపై మెడికల్ ఆఫీసర్లు శిక్షణ ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్‌తో గుండెకు రక్తప్రసరణం అందడం, నోటిద్వారా ఆక్సిజన్ అందించడం వల్ల గుండె పనిచేయడం ప్రారంభించి ప్రమాదానికి గురైనవారిని రక్షించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సీతారామయ్య, సరస్వతి, తిరుపతిరెడ్డి, సునీతతోపాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

ఎలిగేడు: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సీపీఆర్ అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా మాట్లాడుతూ అకస్మాత్తుగా గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ చేస్తే ఆస్పత్రికి వెళ్లేలోపు బతికే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి, గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక, మట్టి అక్రమ రవాణా అరికట్టాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామశివారులోని హుస్సేనిమియా వాగు నుంచి ఇసుక, చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలుతోందని స్థానిక ఎంపీటీసీ మిట్టపల్లి వసంత సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కోట్లాది ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని సహజవనరులను కాపాడాలని కోరారు.

అవకతవకలపై విచారణ చేపట్టాలి



నిరసన దీక్ష చేపట్టిన ఏఐవైఎఫ్ నాయకులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో శానిటేషన్ వాహనాల కొనుగోలులో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బల్దియా కార్యాలయం సమీపంలో నిరాహార దీక్షను ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మార్కపురి సూర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ సుమారు రూ.7 కోట్ల నిధులతో వాహనాలు కొనుగోలు చేసినట్లు బిల్లులు చెల్లించిన అధికారులు, నగరపాలక సంస్థ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఆరోపించారు. నగరపాలక సంస్థ పరిధిలోని పలు విభాగాలు పూర్తిగా అవినీతిలో కూరుకుపోయాయని, డబ్బులు ఇవ్వనిదే పనులు చేయలేని పరిస్థితి ఏర్పడిందని, ఈ విభాగాలపై తక్షణం విచారణ జరిపించి, అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు సాదుల శివ, ప్రధాన కార్యదర్శి అసాల నవీన్, రణవేనీ సుధీర్‌కుమార్, భూసారపు రాజ్‌కుమార్, గొసిక పవన్, వినయ్, సాయికిరణ్, శ్రీకాంత్, వేణు, అంజి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల పని వేళలు మార్చాలి

గోదావరిఖని: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పని వేళలు మార్చాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వినతిపత్రం అందజేశారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శనిగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తోటమాలి కార్మికుల పనివేళలు మార్పు

కమాన్‌పూర్: సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధిలో పని చేస్తున్న తోటమాలి కార్మికుల పని వేళలు మార్పు చేసినట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న తెలిపారు. వేసవి కాలంలో తోటమాలి కార్మికులు ఎండకు తట్టుకోలేక పోతున్నారని వారి పని వేళలు మార్పు చేయాలని ఆర్జీ–3 జీఎం, ఫారెస్ట్ డీజీఎం కర్ణ గారికి యూనియన్ ద్వారా విజ్ఞప్తి చేయగా అధికారులు పని వేళలు మార్పు చేశారని తెలిపారు. కార్మికులు సోమవారం నుంచి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పని చేయాలని పేర్కొన్నారు.

పట్టణంలో విద్యుద్దీకరణ పనులపై దృష్టి


పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని వార్డుల్లో విద్యుద్దీకరణ మెరుగుపర్చేందుకు వీలుగా పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు. పట్టణంలోని 5వ వార్డులో సోమవారం పనులు ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలో పట్టణ ప్రగతి నిధులు రూ. 25 లక్షలతో 178 స్తంభాలను కొనుగోలు చేసామన్నారు. పట్టణాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ రమాదేవి, ఏఈ లు మనోహర్, రమేశ్, రామ్మోహన్‌రెడ్డి, అనిల్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రక్షణపై శిక్షణ తరగతులు

గోదావరిఖని: విద్యుత్ రక్షణపై శిక్షణ తరగతులను సోమవారం ఆర్జీ–2లో నిర్వహించారు. కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, ఆర్జీ–2 ఇంచార్జి జీఎం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యుత్ రక్షణపై పలు కీలకసూచనలు చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ రవీందర్, సిమ్‌టార్స్ డీజీఎం శర్మ, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కాల్వశ్రీరాంపూర్:పాఠశాల బాలికల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆచార్య ఫౌండేషన్ సభ్యుడు డాక్టర్ జవాజి రాజేశ్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో సోమవారం ఆచార్య ఫౌండేషన్ నేతృత్వంలో బాలికలకు హైజిన్‌కిట్స్, పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, ఎంఈవో రాజయ్య, ఎంపీటీసీ మాదాసు సువర్ణ, సర్పంచ్ ఆడెపు శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎలిగేడు: వడగండ్ల వానలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాంపెల్లి బాబు, నియోజకవర్గ కార్యదర్శి కోడూరి చంద్రమౌళి, మండల అధ్యక్షుడు మారం సతీశ్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వడగండ్ల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10వేలు ఇస్తామని చెప్పి నెలరోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు డబ్బులు విడుదల చేయలేదన్నారు. వెంటనే రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాసంపల్లి నగేశ్, రంజిత్, శేఖర్, అల్లి రమేశ్, పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పట్టణంలో మజీదుల వద్ద రంజాన్ పండగ సందర్భంగా ప్రార్థనలు చేసేందుకు మున్సిపల్ సిబ్బంది చదును చేశారు. మజీద్‌తోపాటు చుట్టుపక్కల శుభ్రం చేయాలని ఆదేశించినట్లు మున్సిపల్‌చైర్ పర్సన్ ముత్యం సునీత, కమిషనర్ రాజశేఖర్ తెలిపారు.

పనులు చేస్తేనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తేనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ బాలాజీరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో ఈజీఎస్ పథకం, గ్రామాపంచాయతీలకు వచ్చే నిధులతో అభివృద్ధి పనులను చేయడంలో ప్రజాప్రతినిధులు అలసత్వం ప్రదర్శించవద్దని, అభివృద్ధి చేస్తేనే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు.. అంతకుముందు వివిధ శాఖలపై చేపట్టిన పనులపై అధికారులు చదవి వినిపించగా ఎంపీటీసీలు నిలదీశారు. అగ్రికల్చర్‌పై చర్చించగా ధాన్యం కొనుగోళ్లలో సెంటర్ నుంచి రైస్‌మిల్‌కు వెళ్లిన ధాన్యంలో 2–3 కిలోల కటింగ్ చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు ఫక్కిర్‌యాదవ్, మండల రమేశ్ సభ దృష్టికి తీసుకెళ్లడంతో ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సాక్షిలో ప్రచురితమైన 'తీర్మానాలు అమలయ్యేనా' శీర్షిక పట్ల స్పందించారు. సభలో చేసిన ప్రతి తీర్మానం అమలయ్యే వరకు కృషి చేస్తామన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైస్‌మిల్లర్లు ధాన్యం నాణ్యత పేరుతో కటింగ్ చేస్తే రైతుకు సంబంధం ఉండదని పంపిన కేంద్రానికే సంబంధం ఉంటుందని అవసరమైతే సివిల్ సప్లై అధికారులకు, కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లాలని సూచించారు. సర్వసభ్య సమావేశానికి పూర్తి స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో శశికళ, సర్పంచ్‌ల, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు వీరగోని సుజాత, ఫక్కిర్ యాదవ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి లబ్ధి చేకూర్చిన ఘనత బీఆర్ఎస్‌దే

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని, ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లో సోమవారం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మర్కు లక్ష్మణ్, ఇనుగాల అనంతరెడ్డి, మేకల లక్ష్మణ్, నర్సింగం, సరోత్తంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల శ్రేయస్సు కోసమే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: పేదల శ్రేయస్సు కోసమే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రామగుండం నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్ష తీసుకోవడం పూర్వజన్మ సుకృతం

గోదావరిఖనిటౌన్: హనుమాన్ మాల ధారణ ఒక గొప్ప సంకల్పమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం శ్రీ కోదండ రామాలయంలో హనుమాన్ దీక్షాపరులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 21న శ్రీకోదండ రామాలయంలో నిర్వహించనున్న ఓదెల మల్లన్న కల్యాణ మహోత్సవం పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, కార్పొరేటర్లు, ఆలయ కమిటీ చైర్మన్ తోడేటి శంకర్‌గౌడ్, కార్పొరేటర్ అడ్డాల గట్టయ్య, నాయకులు హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

జ్యోతినగర్: రంజాన్ మాసం ముస్లింలకు పవిత్ర మాసమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం మజీద్–ఏ–జబల్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావులతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎన్వీ రమణారెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, ముస్లింలు పాల్గొన్నారు.

'సివిల్ సొసైటీ ఫోరం' ఆవిర్భావం

కోల్‌సిటీ: సమాజ హితం కోసం పని చేస్తున్న సంఘాలను ఐక్యంగా చేసి, రామగుండం నియోజవర్గం అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పలు రంగాల్లోని ప్రముఖులతో 'సివిల్ సొసైటీ ఫోరం(సీఎస్ఎఫ్)' అనే సంస్థను కొత్తగా గోదావరిఖనిలో ఏర్పాటు చేశారు. గోదావరిఖని దుర్గానగర్‌లో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో 'సివిల్ సొసైటీ ఫోరం' సంస్థ లోగోను ఆవిష్కరించారు. తూముల అశోకరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు రంగాల ప్రముఖులు మాట్లాడారు. సమాజ హితం కోరే అన్ని రంగాలకు చెందిన ప్రతినిధులను ఈ ఫోరంలో భాగస్వామ్యం చేస్తున్నట్లు తెలిపారు. సంఘ పటిష్ఠతకు, నియమ నిబంధనలకు భవిష్యత్ కార్యకపాలకు తోడ్పాటును అందిస్తామని ఐక్య తీర్మానాలు చేశారు.

సుతిలి కొనుగోలుపై విచారణ జరిపించాలి

మంథని: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మూడేళ్లుగా సుతిలి కొనుగోలు పేరిట జరుగుతున్న కోట్లాది రూపాలయ కుంభకోణంపై విచారణ జరిపించాలని మంథనికి చెందిన ఇనుముల సతీశ్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం ఆధ్వర్యంలోని సివిల్ సప్లైశాఖ చేస్తున్న గన్నీ సంచుల తరహాలోనే సుతిలి పంపిణీ చేయాలని కోరారు. సుతిలి ధారాల ఖర్చు లక్షల్లో రాస్తూ ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారని, ప్రతి సీజన్‌లో రూ.15 నుంచి 20 లక్షల ఖర్చు కేవలం సుతిలి పేరిట రాస్తున్నారన్నారు. సుతిలి కొనుగోలుపై విచారణ జరిపించాలని కోరారు.